క్లుప్తంగా

నేడు పోతునూరులో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: పోతునూరు గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీవీవీ ప్రసాద్ (బుజ్జి) అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీటీసీ సున్నా నరేష్‌తో పాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ, సర్పంచ్ కోరారు.

సమైక్యతకు నిదర్శనం గ్రామ దేవత ఉత్సవాలు



ముత్యాలమ్మ వారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్పర్సన్, ఎమ్మెల్యే

నిడమర్రు: గ్రామ సమగ్ర సమైక్యతకు నిదర్శనం గ్రామ దేవత జాతరలు అని జెడ్పీచైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం సిద్దాపురంలో గ్రామ దేవత ముత్యాలమ్మవారి వార్షిక జాతర పూజల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ వైఎస్ ఎంపీపీ నాదు అచ్యుతరామారావు, మాజీ సర్పంచ్ జానకి లక్ష్మి వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జెడ్పీచైర్మన్ పద్మశ్రీ పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యమంలో వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు సిరపరపు శ్రీనివాసరావు, నాదు అప్పారావు, బత్తి భాస్కరరావు తదితరులున్నారు.

2,11,504 ఓట్ల పరిశీలన పూర్తి



దోసపాడులో ఓట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య

దెందులూరు: నియోజకవర్గంలో 2,11,504 ఓట్ల పరిశీలన పూర్తయిందని దెందులూరు నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. మంగళవారం దోసపాడులో ఓట్ల పరిశీలన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ దెందులూరు మండలంలో 411 ఓటర్ల చిరునామాలు మారాయని అన్నారు. 486 ఓట్లు రెండు చోట్ల ఉన్నట్టు గుర్తించామన్నారు. 1,847 మంది వేరే గ్రామాలకు వెళ్లారని, 786 మంది గ్రామాలు వదిలి వెళ్లిపోయారని అన్నారు. నూతనంగా ఓటు హక్కు కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలో 239 బీఎల్‌ఓలు ఓటర్ల వెరిఫికేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



అప్పనవీడు ఆలయంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదపాడు: అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం చేపట్టడం మంచి పరిణామమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, ఆలయ కమిటీ చైర్మన్ నెర్సు భూషణం, దాతలు చింత సంపత్‌కుమార్, కొనకళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత అభయాంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

పెదవేగి : జాతీయ రహదారిపై సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ మంగళవారం బోల్తా పడిన ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడ్డాడు. విజయనగరం నుంచి తెలంగాణ రాష్ట్రం మటంపల్లికి సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ పెదవేగి మండలం అమ్మపాలెం వద్దకు వచ్చేసరికి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడి లారీ క్యాబిన్లో ఇరుక్కుపోయిన నందిగామకు చెందిన లారీ డ్రైవర్ బి. రవిని హైవే అంబులెన్స్ అధికారులు బయటకు తీశారు. ఏలూరులోని సర్వజన ఆసుపత్రికి క్షతగాత్రుడిని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం



కైకరంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: నూతన ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాలు, జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలతో గ్రామాల్లో నూతన శోభ సంతరించుకుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. మంగళవారం 196వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కైకరం సంతబజారు, నాయుడు పేట, బీసీ ఏరియా, గ్రామ పంచాయతీ ఆఫీసు ప్రాంతంలో ఇంటింటికీ ఎమ్మెల్యే వాసుబాబు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ నూతన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, పాఠశాల భవనాల నిర్మాణాలతో గ్రామాల్లో రూపురేఖలు మారాయని అన్నారు. పెద్ద ఎత్తున ప్రజలకు పరిపాలన దగ్గర చేయాలని ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటు చేసిందన్నారు. తద్వారా పాలన ప్రజలకు దగ్గరైన విషయం గ్రహించాలని అన్నారు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకున్న విషయం అందరూ గ్రహించాలని వాసుబాబు కోరారు. రోగులకు సత్వర సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టరు పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రైతులకు సేవలందించేందుకు ప్రత్యేక కార్యాలయాలు(ఆర్‌బీకే) ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. మండల కేంద్రానికి ప్రజల వెళ్లవసరం లేకుండా అన్నిశాఖల బాధ్యులను సచివాలయంలో ఉంచి ప్రజలకు సేవలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. నాడు-నేడుతో పాఠశాలలు రూపురేఖలు మారిన విషయం గ్రహించాలని వాసుబాబు అన్నారు. ప్రతి ఇంటికి పథకాల రూపంలో ఎంత లబ్ధి చేకూరిందో వాసుబాబు వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను, దళిత విభాగం మండల కన్వీనర్ గంటా లక్ష్మణరావు, ఎంపీడీవో ఆంజనేయులు, ఈవో నాగేంద్రకుమార్, నాయకులు వై.శ్రీనివాసు, నెక్కల దుర్గారావు, నడివింటి శ్రీనివాసరావు, ఎస్ కె సాను, నడివింటి నాగరాజు, గంజి రవి, ప్రభాకరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో వినతులు స్వీకరణ ద్వారా సమస్యల పరిష్కారమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయానికి దెందులూరు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల నుంచి వచ్చిన పలువురు వినతిపత్రాలు అందజేశారు. వినతి పత్రాలను సంబంధిత శాఖ ఉద్యోగులకు సిఫార్సు చేశారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శ

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ఆయుష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పోతునూరు ఎంపీటీసీ సున్నా నరేష్ బావ మద్దుల వినోద్‌ను పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్ తదితరులున్నారు.

ఆన్‌లైన్ ద్వారా రుణ వాయిదాల చెల్లింపులు

ఉంగుటూరు: స్త్రీనిధి మహిళా బ్యాంకు నూతనంగా ప్రారంభించిన పేటీఎం మిషన్ ద్వారా రుణ వాయిదాలు చెల్లించే విధానం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. దీనిని ప్రయోగాత్మకంగా ఉంగుటూరు మండలంలో మొదటిసారిగా ప్రస్తుతం అమలు చేస్తున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డా.ఆర్ విజయరాజు మంగళవారం తెలిపారు. సెప్టెంబరు నుంచి ఈ పద్ధతి అన్ని సంఘాల్లో అమలయ్యేలా అన్ని సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తామన్నారు.

వ్యాయామ కళాశాల విద్యార్థుల జాతీయస్థాయి ప్రతిభ



గోపన్నపాలెంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు

దెందులూరు: స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల విద్యార్థులు మరోసారి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచారు. 2022-23 సంవత్సరానికి జాతీయస్థాయిలో సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు 32 మంది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. మంగళవారం గోపన్నపాలెం కళాశాలలో జాతీయ స్థాయి క్రీడా ప్రశంసాపత్రాలను , ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీడీకేడీ ప్రసాద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్యామలాదేవి, ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, విజయలక్ష్మి అందజేసి అభినందించారు.

శాంతి స్థాపనలో మానవత పాత్ర మహోన్నతం



గణపవరంలో మానవత శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: సమాజంలో శాంతి స్థాపనకు మానవత సంస్థ చేస్తున్న కృషి మహోన్నతమైనదని, ఇలాంటి సంస్థలు చేస్తున్న కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా మానవత సంస్థ ఆధ్వర్యంలో గణపవరంలో శాంతి ప్రదర్శన, ఆవిర్భావ సభ నిర్వహించారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి వద్ద శాంతి ప్రదర్శనను ఎమ్మెల్యే వాసుబాబు జెండా ఊపి ప్రారంభించి గణపవరం పోలీస్ఐలెండ్ సెంటర్ వరకూ ప్రదర్శనలో పాల్గొన్నారు. పోలీస్ ఐలెండ్ వద్ద శాంతి కపోతాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వాసుబాబు మాట్లాడుతూ ప్రజలందరూ శాంతి మార్గంలో పయనిస్తూ మన దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలపాలని సూచించారు. మానవత వంటి స్వచ్ఛంద సంస్థలు మరిన్ని ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ఆలోచనకు ప్రతిరూపంగా మానవత సంస్థ ఇద్దరు ముగ్గురితో ఏర్పాటై నేడు శాఖోపశాఖలుగా గ్రామగ్రామాన విస్తరించి, కోట్లాది రూపాయల సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా సంస్థలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. జిల్లా శాంతి కమిటీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ మానవత సంస్థ సమాజంలో శాంతిని పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఫ్రీజర్లు, అన్ని మండలాల్లో శాంతిరథాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానవత చైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, మానవత జిల్లా నాయకులు అప్పక రాంబాబు, సాగిరాజు జానకిరామరాజు, గణపవరం మండల వెల్లంకి నరేష్, కాకర్ల వినాయక, పుప్పాల గోపి, పాతపాటి హరికుమార్‌రాజు, సీహెచ్ నాగేశ్వరరావు, వంకాయల రామారావు,నర్సంచ మూర అలంకారం, ఆర్‌వీఎస్ రాజు, మండల మానవత అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు, కార్యదర్శి బుద్దారపు వుల్లయ్య పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత



ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించిన తీరును వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, రామశింగవరంలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రామశింగవరంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొన్నారు. రామసింగవరం పంచాయతీ దుర్గమ్మ కాలనీలో ఆయన నూకాలమ్మ దేవతకు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు రామసింగవరం- బాధరాల రహదారిని అభివృద్ధి చేశామని, మెట్ట మీద 417 జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరు చేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. సుమారు రూ. 8 కోట్లతో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ వంటి నిర్మాణాలు పూర్తి చేశామని చెప్పారు. రూ.15 కోట్లు వెచ్చించి గ్రామంలో ప్రజలకు కావలసిన అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి గడపగడపను సందర్శించి స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి గంగాధరరావు, పనుమర్తి మహీంద్ర, సీతాల దాను, అద్దేపల్లి రాంబాబు, రాచపల్లి రాంబాబు, చింతపల్లి నాగరాజు, వెన్నవెల్లి రవి, గోపిశెట్టి శ్రీను, గోపిశెట్టి రాజు, రాట్నాలమ్మ దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు, కామిరెడ్డి నాని, గోపిశెట్టి రాధమ్మ, జిల్లా నాగరాజు, బైపా ఆదాం, కంటిపూడి ధర్మరాజులు, ఆళ్ళ బాబి, యలమర్తి జయరాజు, జిల్లా వెంకటేష్, జమ్మిశెట్టి ఆంజనేయులు, సిద్దర్ల వరబాబు, చిలుకూరి సుబ్బారావు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలి

దెందులూరు: మండలంలో పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్ ప్రభుత్వ భూములను ఆక్రమించిన ఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలని దెందులూరు మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినిని కోరారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు, పేదలు దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం 5 దశల సర్వేల్లో భాగంగా గ్రామంలో ఉన్న అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములు ఎవరెవరు ఎంత ఆక్రమించారు. ఎంత అనుభవిస్తున్నారే వివరాలను గ్రామాల వారీగా పేర్లు బహిర్గతం చేయాలన్నారు. దోసపాడులో అసైన్డ్, సీలింగ్ భూములు 300 ఎకరాలు, కొవ్వలిలో 250 ఎకరాలు భూస్వాములు అన్యాక్రాంతం చేసి అనుభవిస్తున్నారన్నారు. దెందులూరు మండల కేంద్రంలో 70 ఎకరాల ప్రభుత్వ భూమి స్థానిక భూస్వాముల చేతుల్లో ఉందన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూమి లేని పేదలకు భూములు పంచాలని నాయకులు రామకృష్ణ, ఆనందరావు, జాన్‌రాజు, లక్ష్మి, ఏసురాజు కోరారు.

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన రాజీమనోజ్

పెదవేగి : మండలంలోని జగనన్న లేవుట్లలో బేస్‌మెంట్ కూడా నిర్మించని గృహ నిర్మాణాలను గుర్తించి నిర్మాణాలు వేగవంతమయ్యేలా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంటనే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గంజి రాజీమనోజ్ ఆదేశించారు. గృహ లబ్ధిదారులను చైతన్య వంతులను చేయాలని ఆయన సూచించారు. మంగళవారం ఎంపీడీఓ మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. గృహాలతో పాటు ప్రాధాన్యత గల వివిధ నిర్మాణ దశలలో ఉన్న సచివాలయాల నిర్మాణాలు, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. నాడు-నేడులో నిధులున్న గ్రామాల్లో అదనపు తరగతి గదులు పూర్తి స్థాయిలో నిర్మించే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపీడీఓ రాజీమనోజ్ ఆదేశించారు. పెదవేగి మండలంలో కొన్ని సచివాలయ, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు కోర్ట్ వివాదాల్లో ఉన్నాయని తెలిపారు. మండలంలో వంగూరు, తాళ్లగోకవరం, జానంపేట, కవ్వగుంట తదితర గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన ఆర్‌బీకే, సచివాలయం, హెల్త్ క్లినిక్ లు వివిధ దశలలో నిలిచిపోయాయన్నారు. వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సత్వర చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇప్పటికే మండలస్థాయిలో 32 ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తిచేసి జిల్లాస్థాయిలో పెదవేగి మండలం ప్రథమస్థానంలో నిలిచిందని ఎంపీడీవో తెలిపారు. జగనన్న కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలకు సమయం పడుతుందని, జగనన్న కాలనీల్లో నివాసాలుంటున్న లబ్ధిదారుల సౌకర్యార్థం డ్రైయినేజీల నిర్మాణం చేపట్టే వరకు ఇళ్లల్లో వాడే నీరు రహదారుల పైకి రాకుండా ఇప్పటి వరకు 521 వ్యక్తిగత ఇంకుడుగుంతలు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయని రాజీ మనోజ్ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ కె నాగరాజు పాల్గొన్నారు.

వంగూరులో ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



జీతాలు పెంచాలని ధర్నా చేస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్)/పెదవేగి: అగ్రిమెంటు ప్రకారం జీతాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ పాత బకాయిలు చెల్లించాలని, ప్రస్తుత కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం పెదవేగి మండలం వంగూరు గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎంఎస్ బయోటెక్ ఫ్యాక్టరీ కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ వివరాలను ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు ఏలూరులో వెల్లడించారు. తొలుత మెయిన్‌రోడ్డు నుంచి ఫ్యాక్టరీ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. గేటు వద్ద ధర్నా చేశారు. జీతాలు పెంచాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డీసీఎల్ వద్ద జరిగిన అగ్రిమెంట్ ప్రకారం ఏప్రిల్ ఒకటి నుంచి జీతాలుపెంచాల్సి ఉండగా, యాజమాన్యం పెంచలేదని చెప్పారు. గతంలో కూడా ఆందోళన చేశామని, అయినా యాజమాన్యం జీతాలు పెంపుదల చేయలేదన్నారు. గౌతమి ఫ్యాక్టరీని ఎమ్మెస్ బయోటెక్ ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేసినప్పుడు ఈఎస్ఐ, పీఎఫ్, పాతబకాయిలు మొత్తం చెల్లిస్తామని అగ్రిమెంట్లో రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ ఎం.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి బద్దా వెంకట్రావు, ఫ్యాక్టరీ యూనియన్ ప్రెసిడెంట్ వాడపల్లి పద్మ, నాయకులు ఎ.ఆలీసమ్మ, బెజవాడ పద్మ, మోతీ భవానీ, రంగమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



భీమడోలులో ఇళ్ల నిర్మాణాలపై ఏఈని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ కనమాల రామయ్య

భీమడోలు: మండలంలోని అధికారులు, ప్రతిప్రజానిధులు సమన్వయంతో పని చేసి మండలానికి జిల్లాస్థాయిలో గుర్తింపు తేవాలని భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అజెండాలోని అంశాలను వివరించారు. శాఖల వారీగా సమీక్షించారు. సమావేశానికి గైర్హాజరైన ఇరిగేషన్, ఆర్టీసీ అధికారులను నోటీసులు ఇవ్వాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించించారు. రోడ్లు, మంచినీటి, కోల్లేరులోని కాంటూరులో ఆక్వా చెర్వుల విస్తరణ తదితర సమస్యలను సభలో ఎంపీటీసీ సభ్యులు ముళ్లగిరి జాన్సన్, గంటా శ్రీనివాసరావు, ఆజాద్ లేవనెత్తారు. మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంపీటీసీలను కనీసం సమాచారం ఇవ్వలేదని వారు వాపోయారు. గుండుగొలను ఎంపీటీసీ నత్తా నాగిని ఉపాధి కూలీలకు కొన్ని రోజులుగా వేతనం అందడం లేదని సభ దృష్టికి తీసుకుని రాగా సాంకేతిక కారణాలుంటే పరిష్కరించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. లబ్ధిదారులు బ్యాంకుల్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో కె.పద్మ సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇంజనీరింగ్ సహాయకులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని, వారితో మండలస్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సంబంధిత ఏఈ సతీష్‌కి సభ్యులు సూచించారు. తమ పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండల పరిధిలోని రూ.2.15 కోట్ల విలువ గల పనులు మంజూరయ్యాయని, వాటిలో ఇంకా రూ.50లక్షల విలువ గల పనులు ప్రారంభం కాలేదని ఎంపీపీ అన్నారు. ఇంకా చేపట్టని పనులు వివరాలను ఎంపీటీసీలు తెలియజేస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. పూళ్లలోని మంచినీటి ఫిల్టర్ బెడ్ మరమ్మతుల నిమిత్తం మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు, గుండుగొలనులో రోడ్ల నిర్మాణానికి రూ.2లక్షలను కేటాయించామన్నారు. మండలాభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతు పాత్రను పోషించాలని తద్వారా మండలానికి తగిన గుర్తింపు తీసుకుని రావాలని ఎంపీపీ కోరారు. అభయారణ్యం పరిధిలో ఎంఎంపురం ఏరియాలో అక్రమంగా చెరువులు తవ్వుతున్నారని ఎంపీటీసీ గంటా శ్రీనివాస్ వివరించారు. ప్రస్తుతం ఎటువంటి ఆక్వా చెరువుల తవ్వకాలు జరగడం లేదని, గతంలో ఆ చెరువు నిర్వాహకునిపై కేసు నమోదు చేసామని ఫారెస్ట్ సెక్షన్ అధికారిణి ఎంపీ రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, వైస్ ఎంపీపీ దోశల వాసంతి, భీమడోలు సొసైటీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఏఈలు భాస్కరరావు, డి.సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, పూళ్ల, అంబర్‌పేట సర్పంచులు దాయం సుజాత ప్రసాద్, ఏపూరి భానుదీపిక రాంబాబు, ఎంపీటీసీ అంబటి దేవ్ ప్రసాద్, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం

భీమడోలు: జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డులను అందుకున్న అధికారులు సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ఎంపీడీవో కార్యాలయ టైపిస్ట్ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ సతీష్ జిల్లాస్థాయిలో ఉత్తమ అధికారులుగా జిల్లాస్థాయిలో అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా భీమడోలు ఎంపీపీ సమావేశంలో మందిరంలో మంగళవారం అవార్డు గ్రహీతలను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అవార్డులు దక్కడం శుభ పరిణామన్నారు. మండలానికి జిల్లాస్థాయిలో గుర్తింపు తెచ్చారని, ఇదే స్ఫూర్తితో పని చేసి మండలానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డులు అందేలా తమ వంతు కృషి చేయాలన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారికి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, వైస్ ఎంపీపీ దోశల వాసంతి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు శ్రమించాలి

ఏలూరు టౌన్: తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ విద్యార్థులకు సూచించారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు త్రీటౌన్ పరిధిలో కళాశాలల వద్ద ఆకతాయిల్లా తిరుగుతోన్న విద్యార్థులకు ఆయన ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు శ్రమించాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయవద్దని సూచించారు. చదువుకోవాల్సిన సమయంలో ఏదైనా వివాదాల్లో చిక్కుకుని, పోలీసు కేసులు నమోదయితే భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. విద్యార్థులు 20 ఏళ్ల పాటు కష్టపడి చదివితే జీవితంలో మరో 60 ఏళ్లు సుఖసంతోషాలతో గడిపే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.